

తొర్రూర్ రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

రంగనాథస్వామిని దర్శించుకున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్ రంగనాథస్వామి ఆలయంలో యజ్ఞం హోమంలో బుధవారం రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీతో సమావేశమై ఆలయ అభివృద్ధి కోసం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న రంగనాథస్వామి ఆలయాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన యజ్ఞంలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మల్‌రెడ్డి యాదిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అనీల్‌రెడ్డి, నాయకులు సంరెడ్డి వెంకట్‌రెడ్డి, భూషణ్ గౌడ్, సుమలత, గుండ్లపల్లి ధన్‌రాజ్‌గౌడ్, నక్క శివలింగంగౌడ్, జైపాల్‌రెడ్డి, గణేష్‌నాయక్, గోపాల్‌రెడ్డి వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.



పార్కులో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

ఓపెన్ జిమ్ ప్రారంభం

చంపాపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని ద్వారకానగర్‌కాలనీలోని పార్కులో బుధవారం జీహెచ్‌ఎంసీ నిధులు రూ.10.50లక్షలతో చేపట్టిన ఓపెన్ జిమ్‌ను కార్పొరేటర్ సుజాతానాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నిత్యం వ్యాయామంను ప్రతి ఒక్కరూ దినచర్యగా చేసుకోవాలని కోరారు. కాలనీలో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీప్రతినిధులు దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, లక్ష్మయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.



స్వచ్ఛ రిక్షాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు : శ్వేతారెడ్డి

సైదాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహించవద్దని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి తెలిపారు. చెత్త తరలింపు కార్మికులకు కార్పొరేటర్ బుధవారం ఇంద్రప్రస్థకాలనీ పార్కులో స్వచ్ఛ రిక్షాలను పంపిణీ చేశారు. కార్మికులకు విధుల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా అండగా ఉంటానని తెలిపారు. శానిటేషన్ అస్తవ్యస్తంపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్లు పక్రుద్దీన్, అర్జున్‌నాయక్, జవాన్లు కృష్ణ, రాము, రాజ్‌కుమార్, గోపాల్, సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

బీసీ కులగణన అంతా తప్పుల తడక : సుభాష్‌చందర్‌జీ



మాట్లాడుతున్న నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ

సైదాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుల తడకగా బీసీ కులగణన జరిపిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ అన్నారు. బుధవారం సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వేలో బీసీల శాతాన్ని తగ్గించి రాజకీయంగా అణిచివేసేందుకు కుట్రయని ఆరోపించారు. మండల్ కమిషన్‌లో 51శాతం, బీఆర్‌ఎస్ సమగ్ర కుటుంబ సర్వేలో 52శాతం బీసీలు ఉన్నారని వెల్లడైందని వివరించారు. తాజా కులగణనలో 46శాతం ఉన్నట్లు తగ్గుదల రావడం బీసీలకు ద్రోహానికి అద్దం పడుతుందని విమర్శించారు. 12శాతం ముస్లింల జనాభాను చూపిస్తూ 2శాతం ముస్లిం బీసీలు, ముస్లిం ఓసీ అని చూపించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మతపరమైన రిజర్వేషన్లు చెల్లవని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని గుర్తుచేశారు.



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

118 జీవో సమస్యలు పరిష్కరించండి : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 118 జీవో సమస్యలు పరిష్కరించాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని పలు కాలనీల్లో 118 జీవో కన్వీనెన్స్ డీడ్ పొందిన వారికి ఇంటి పన్నుతో పాటు ఖాళీ స్థలానికి సైతం ట్యాక్సీలు రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకవచ్చారు. అనంతరం ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని కమిషనర్ కార్పొరేటర్‌కు హామీ ఇచ్చారు. పలు కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



పార్క్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి

పార్క్ పనుల పరిశీలన

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని ఎస్‌బీఐ ఆఫీసర్స్‌కాలనీ పార్క్‌ను వీలైనంత త్వరగా కాలనీవాసులకు, వాకర్లకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. బుధవారం ఎస్‌బీఐ ఆఫీసర్స్‌కాలనీ పార్క్ పనులను ఆమె పరిశీలించారు. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఇక్కడి కాలనీ పార్క్ అధ్వానంగా తయారు కావడంతో కొత్తగా అవసరమైనన్ని నిధులను మంజూరు చేయించి అందరికీ అందుబాటులో ఉండేలా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ వివరించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ శరత్‌రెడ్డి, సైట్ ఇంజనీర్ ఏడుకొండలు, కాలనీవాసులు మల్లికార్జున్, సంతోష్, పరశురాం, ఉమేష్, సాయి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై చిత్తశుద్ధి చాటుకున్న సీఎం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాతారెడ్డి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటపై నిలబడి తన చిత్తశుద్ధి చాటుకున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. అసెంబ్లీలో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు క్యారగారి శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం బడంగ్‌పేట్‌లో నిర్వహించిన సంబరాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పారిజాతారెడ్డి మాట్లాడుతూ మాదిగలు మంద కృష్ణమాదిగ నాయకత్వంలో ఎన్నో సంవత్సరాల నుంచి వర్గీకరణ కోసం పోరాడుతున్నారని, ఇన్నాళ్లకు వారి కల నెరవేరే సమయం ఆసన్నమయిందని అన్నారు. వర్గీకరణతో భవిష్యత్‌లో వారికి అన్ని రంగాల్లో సరైన న్యాయం జరుగనున్నదని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షురాలు సమత, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ బండారి మనోహర్, నాయకులు బాల్‌నింగని జంగయ్య, ఎర్ర జైహింద్, రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, పుట్టగల్ల జగన్, మాదరి శ్రీనివాస్, కుమార్, నీరుడి శ్రీరాములు, ఉమేశ్, గిరి ముదిరాజ్, తిరుమల్, భాను, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు శ్యాంరావు

ఎస్సీ వర్గీకరణపై సీఎం తీసుకున్న నిర్ణయంపై హర్షం

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో జనాభా ప్రాతిపదికన మాదిగలకు 9శాతం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన ప్రకటనపై కాంగ్రెస్ ఎస్సీ వర్గానికి చెందిన మలక్‌పేట నాయకులు హర్షం ప్రకటించారు. బుధవారం మూసారాంబాగ్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ ఎస్సీ వర్గానికి చెందిన మలక్‌పేట నాయకులు కె.శ్యాంరావు, బాబు శ్రీనివాస్, భువనగిరి చంద్రశేఖర్, సంగపాగే ధర్మేందర్, డి.గోపాల్, మొండి శ్రీనివాస్‌తో కూడిన బృందం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి వారందరు కలిసి క్షీరాభిషేకం చేశారు. రేవంత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి, ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన మొట్టమొదటి రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని నిలపడంలో సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న చారిత్రాత్మకమైన నిర్ణయం పట్ల వారు హర్షం ప్రకటించారు.



బడంగ్‌పేట్‌లో రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న పారిజాతారెడ్డి తదితరులు

క్రీడలతో శారీరక మానసికోల్లాసం : ఎమ్మెల్యే సబిత

ఎల్బీనగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మారుతున్న జీవన విధానంలో మనిషికి క్రీడలు చాలా అవసరమని మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం సరూర్‌నగర్ స్టేడియంలో బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్‌మీట్-2025ను సబితారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు శరీరదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయన్నారు. విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ పెంచుకుని ఆడి రాణించాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని వాటిని స్పోర్టివ్‌గా తీసుకుని స్నేహభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. క్రీడల వల్ల క్రమశిక్షణ అలవడుతుందన్నారు. పాఠశాలల యాజమాన్యాలు క్రీడలను ప్రోత్సహించాలన్నారు. ఆటల పోటీలతో విద్యార్థులకు పోటీ తత్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ డ్రగ్స్ బ్యూరో డీఎస్పీ సుబ్బిరామిరెడ్డి, జిల్లా క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావు, బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి శేఖర్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి జే. శ్రీనివాస్‌రావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా కోశాధికారి మీనేందర్‌రావు, సరూర్‌నగర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవేందర్‌గౌడ్, కోశాధికారి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



తుర్కయంజాల్ మున్సిపాలిటీ కొహెడా జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం స్థానిక పాఠశాల సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ సొంత ఖర్చులతో పదవ తరగతి విద్యార్థుల కోసం స్టడీ మెటీరియల్ తయారు చేయించి అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు దన్నే రాజుతో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. - హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి

'సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి'

సరూర్‌నగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బంజారాలా ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజైన ఫిబ్రవరి 15వ తేదీని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కేతావత్ రతన్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. చెట్టుకొకరు, పుట్టకొకరుగా ఉన్న బంజారాలను ఒక్కచోటికి చేర్చి, వారికి సరైన గమ్యం చూపించిన సేవాలాల్‌కు తగిన గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. ఈ దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతి రోజును కచ్చితంగా సెలవు దినంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): లైసెన్సు లేకుండా, సరైన ధ్రువ పత్రాలు లేకుండా విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ భరత్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట నివాసి పఠాన్ యూసుఫ్ మహమూద్‌ఖాన్(43) చిన్న చిన్న వ్యాపారాలు చేసి జీవనం సాగిస్తున్నాడు. ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న ఆశతో మహమూద్‌ఖాన్ లైసెన్సు లేకుండా సరైన ధ్రువపత్రాలు లేకుండానే ఓల్డ్‌మలక్‌పేట వాహెద్‌నగర్‌లో విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్నట్లుగా అందిన సమాచారం మేరకు సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి చాదర్‌ఘాట్ పోలీసులు దాడులు నిర్వహించారు. నిందితుడు మహమూద్‌ఖాన్‌ను అరెస్టు చేసి 450 విదేశీ సిగరెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో గొడవ పడి కుమారుడు అదృశ్యం

హయత్‌నగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఇంట్లో గొడవ పడి కుమారుడు అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగనూరు టెలిఫోన్‌కాలనీలో నివాసం ఉండే మేడారం మధనాచారి కుమారుడు మేడారం శ్రీనివాస్(29) ఆదివారం ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. దీంతో శ్రీనివాస్ అలిగి సోమవారం ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. తండ్రి ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ అని వచ్చింది. రెండు రోజులైనా కుమారుడు ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో బుధవారం సాయంత్రం తండ్రి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెంట్రింగ్ వర్కర్..

హయత్‌నగర్ : సెంట్రింగ్ వర్కర్ అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. కొహెడాలో నివాసం ఉండే ఇర్ఫో ఫిరంగి దుర్వి(42) సెంట్రింగ్ కార్మికునిగా పనిచేస్తున్నాడు. జనవరి 27న శశంకర్ రంజిత్ అనే వ్యక్తి కోహెడా నారాయణ కళాశాల వద్ద పని ఉందని చిట్టి బలిజ రాంచందర్ వద్దకు తీసుకువచ్చాడు. అంత వరకు అక్కడే ఉన్న ఇర్ఫో ఫిరంగి దుర్వి కనిపించలేదని శశంకర్ రంజిత్ 28న రాంచందర్‌కు ఫోన్ చేశాడు. దీంతో రాంచందర్ ఇర్ఫో ఫిరంగి గురించి కొహెడా చుట్టుపక్కల తెలిసిన వారి వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో రాంచందర్ బుధవారం సాయంత్రం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బాలికతో పరిచయం పెంచుకుని, ప్రేమ పేరుతో వేధిస్తూ, అసభ్యంగా ప్రవర్తించిన కేసులో.. నిందితుడు జలపూర్ సాయికిరణ్(20)కు ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం ఏడాది జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధించింది. బాధితురాలుకి రూ.50వేలు పరిహారం అందించాలని ఆదేశించింది. ఈ కేసులో రాచకొండ పోలీసుల తరపున అదనపు పబ్లిక్‌ప్రాసిక్యూటర్ సునీత వాదనలు వినిపించారు.

వీసాలేదు.. పాస్‌పోర్టు లేదు

- నగరంలో పట్టుబడ్డ నైజీరియన్
- డ్రగ్స్ స్మగ్లర్‌గా మారకముందే స్వదేశానికి పంపే ప్రయత్నం

హైదరాబాద్ సిటీ : ఎలాంటి వీసా, పాస్‌పోర్టు లేకుండా నగరంలో తిరుగుతున్న నైజీరియన్‌ను హెచ్ న్యూ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించిన క్రమంలో ముంబైలో అరెస్టయి, రెండేళ్ల జైలు జీవితం గడిపి వచ్చినట్లు తేలింది. అతడు డ్రగ్స్ స్మగ్లర్‌గా మారకముందే వెంటనే డిపోర్టేషన్ ద్వారా నైజీరియాకు పంపాలని సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశించారని హెచ్ న్యూ డీసీపీ వైవీ సుధీంద్ర తెలిపారు. బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ పూర్తి వివరాలు వెల్లడించారు. నైజీరియాకు చెందిన ఇకెచుకువు సెల్విస్టర్ అలియాస్ సెల్విస్టర్ 2012లో బిజినెస్ వీసాపై ఇండియాకు వచ్చాడు. ముంబైలో క్లాత్ బిజినెస్ చేస్తూ.. ఇక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసిన క్లాత్స్‌ను నైజీరియాకు ఎగుమతి చేసేవాడు. 2019లో ముంబై పోలీసులు సెల్విస్టర్‌ను పాస్‌పోర్టు కేసులో అరెస్టు చేశారు. దాంతో అతను ముంబై సెంట్రల్ జైల్లో జైలు శిక్ష అనుభవించి వచ్చాడు. ఆ తర్వాత ముంబైలోని ఉల్వే ప్రాంతంలో ఉంటున్న నైజీరియన్ స్నేహితుల వద్దకు చేరి అక్కడే ఉంటున్నాడు. స్నేహితులంతా డ్రగ్స్ సరఫరాలో ఆరితేరుతుండగా.. అతను మాత్రం ఇంకా అలాంటి నేరాలకు పాల్పడలేదు. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న స్నేహితుల వద్దకు వచ్చాడు. వారు కూడా ముంబై, బెంగళూరుకు చెందిన ప్రధాన డ్రగ్స్ స్మగ్లర్స్‌తో లింకులు ఉన్నవారే కావడం గమనార్హం. సెల్విస్టర్ వారితో కలిసి నగరంలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో హెచ్ న్యూ పోలీసులకు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ డానియెల్ టీమ్ రంగంలోకి దిగి సెల్విస్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించగా.. వీసాగానీ, ఎలాంటి పాస్‌పోర్టుగానీ లేవని, అదే కేసులో గతంలో ముంబైలో అరెస్టయినట్లు తేలింది. హెచ్‌న్యూ పోలీసులు ఎఫ్ఆర్ఆర్‌వో సహకారంతో డిపోర్టేషన్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని డీసీపీ సుధీంద్ర వెల్లడించారు.

బడ్జెట్ కేటాయింపులు అన్నిరంగాలకూ అనుకూలం

సైదాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బడ్జెట్ కేటాయింపుల్లో అన్ని రంగాలకు అనుకూలంగా ప్రవేశపెట్టారని కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం సైదాబాద్‌లో డివిజన్ అధ్యక్షుడు సూరజ్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ దేశం అభివృద్ధిపరంగా ఆర్థికంగా ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు మంజులారెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గజానంద్, బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి రమణ్‌సింగ్, నాయకులు రాజేష్, సుధీర్‌రెడ్డి, గోపీ, నవీన్ బండారి, శ్రీధర్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ అరుణారెడ్డి



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓల్డ్‌మలక్‌పేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరేలా బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం ఓల్డ్‌మలక్‌పేటలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సతీష్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ స్థితిగతులను మారుస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోటేశ్వర్‌రావు, చౌకి రాజు, సీహెచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగ మేళా

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు గురువారం జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాధికారి జయశ్రీ తెలిపారు. ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు గాను ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు. రిటైల్, ఈ-కామర్స్ బ్యాంకింగ్, బీపీఓ రంగాల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు విద్యార్హత 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసి ఉండాలి. వయస్సు 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల లోపు ఉండాలి. రంగారెడ్డి జిల్లా ఉపాధి కార్యాలయం, శాంతినగర్, ఐటీఐ క్యాంపస్, మల్లేపల్లి, తెలంగాణ-500057కు స్వయంగా సంప్రదించాలి. మరిన్ని వివరాల కోసం 9963493453, 9063099306 ద్వారా సంప్రదించవచ్చు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ సాయిరాంనగర్‌కాలనీలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సుల్తాన్‌వాల్యా 11కేవీ విద్యుత్ ఫీడర్‌లో వివిధ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 11గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డివిజన్ ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని చంపాపేట మసీద్ ఏరియా, సుల్తాన్‌వాల్యా, కటికోనికుంట, సాయిరాంనగర్‌కాలనీ, ఇన్నర్ రింగ్‌రోడ్‌లోని భారత్ పెట్రోల్‌పంప్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో..

సంతోష్‌నగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ లక్ష్మీగణపతి, తట్టిఅన్నారం, టీఎస్ హౌసింగ్‌బోర్డు ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో నిర్వహణపనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ తెలిపారు. 11కేవీ లక్ష్మీగణపతి, తట్టిఅన్నారం, టీఎస్ హౌసింగ్‌బోర్డు ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య

- ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.. మరొకరు సీఏ విద్యార్థి, ప్లంబర్

అమీర్‌పేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా మరొకరు సీఏ చదువుతున్నాడు. ఇంకొకరు ప్లంబర్. ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా బూగారం మండలం బోపాల్‌పూర్ గ్రామానికి చెందిన గంతల కుమార్(28) గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ బీకేగూడ సంజయ్‌గాంధీనగర్ కాలనీలో తన స్నేహితుడు గంగాధర్‌తో కలిసి ఉంటున్నాడు. బుధవారం ఉదయం గంగాధర్ బయటకు వెళ్లి తిరిగివచ్చేసరికి కుమార్ ఉరేసుకుని కనిపించాడు. గంగాధర్ ఫిర్యాదు మేరకు అక్కడకు చేరుకున్న పోలీసులు సుసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. 'ఈ జీవితం నాకు నచ్చలేదు నన్ను క్షమించండి' అని అందులో ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు.


బాపూనగర్ హాస్టల్‌లో సీఏ విద్యార్థి..

మంగళవారం రాత్రి సీఏ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కర్నాటక రాయ్‌చూర్ జిల్లాకు చెందిన రాజుశెగ్గి కుమారుడు అమర్‌జిత్(18) ఎస్ఆర్‌నగర్ బాపూనగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ సీఏ చదువుతున్నాడు. డిసెంబర్ 22న పరీక్షలు రాసి సొంత గ్రామానికి వెళ్లాడు. పరీక్షలు సరిగా రాయలేదని బాధపడ్డాడని కుటుంబ సభ్యులు తెలిపారు. జనవరి 27న మరో పరీక్ష రాయాల్సి ఉండగా తిరిగి నగరానికి వచ్చి హాస్టల్‌లో ఉన్నాడు. మంగళవారం ఉదయం కళాశాలకు వెళ్లాల్సి ఉండగా తన ఆరోగ్యం బాగాలేదని గదిలోనే ఉన్నాడు. రాత్రి 10.30గంటల సమయంలో రూమ్‌మేట్ ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో హాస్టల్ నిర్వాహకులకు చెప్పాడు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు తెరిచి చూడగా అమర్‌జిత్ ఉరేసుకుని కనిపించాడు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు విచారణ జరిపి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

సరూర్‌నగర్ : ప్లంబర్‌గా పనిచేసే ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. ముక్కెర్ల వెంకటేశ్(50) అనే వ్యక్తి మీర్‌పేట్‌లోని సర్వోదయానగర్ కాలనీలో ఉంటూ ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై బాగా మద్యం సేవించి మత్తులో ఎక్కడ బడితే అక్కడ పడుకుంటున్నాడు. దాంతో కుటుంబంలో కలహాలు సైతం తలెత్తాయి. నెలరోజులుగా ఇంటికి కూడా వెళ్లకుండా మంత్రాలచెరువు సమీపంలోని పబ్లిక్ టాయ్‌లెట్స్ వద్ద పడుకుంటున్నాడని తెలిసింది. కాగా బుధవారం చెరువు సమీపంలోని చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మీర్‌పేట్ పోలీసులు అక్కడకు చేరుకుని శవాన్ని ఉస్మానియాకు తరలించారు. మృతుడి భార్య వాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కొత్తపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎల్బీనగర్ సీపీ క్యాంపులోని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ తెలిపారు. రెండో విడతలో బుధవారం రాజీవ్‌గాంధీనగర్ జడ్‌పీహెచ్‌ఎస్ నుంచి 72మంది విద్యార్థులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. వారికి లెక్చర్‌హాల్‌లో డ్రాయింగ్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల విద్యార్థులకు చిల్డ్రన్ ట్రాఫిక్ ట్రెయినింగ్ పార్కులో, కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సాధారణ ప్రజలకూ, డ్రైవర్లకూ రహదారి భద్రత, నిబంధనల ప్రాధాన్యత తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మల్కాజిగిరి పరిధిలో 10 ప్రాంతాల్లో నిబంధలను అధికారులు వాహనాల డ్రైవర్లకు, యజమానులకు, ప్రజలకూ వివరించారని తెలిపారు. ప్రమాదాలపై అవగాహన కోసం తయారు చేసిన కరపత్రాలను 869మందికి పంపిణీ చేశారన్నారు.



నిబంధన అంశాలపై డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

51 మందికి డీడీ కౌన్సెలింగ్

వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 51మంది మద్యం ప్రియులకు 51 మంది కుటుంబ సభ్యుల సమక్షంలో సీపీ క్యాంపు వద్ద చిల్డ్రన్‌పార్కు లెక్చర్‌హాల్‌లో బుధవారం 5 విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో ఇన్‌స్పెక్టర్ అర్జున్ విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్ఐపీ అల్లూరయ్య కౌన్సెలింగ్, తనిఖీల ప్రాధాన్యతను గుర్తుచేశారు. మద్యంమత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరమని వీడియో క్లిప్స్ ప్రదర్శించారు. టీటీఐ సిబ్బంది రమేష్ కౌన్సెలింగ్‌కు హాజరైన వారికి అవగాహన కోసం వీడియో క్లిప్పులు, పాటలు ప్రదర్శించారు.